క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరుతున్న నాయకులు

ఎలిగేడు: ఓదెల మండలం పొత్కపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ఎలిగేడు మండలం శివపల్లిలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు స్వగృహంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో దాసరి రాజన్న(మాజీసర్పంచ్), గడ్డం లక్ష్మీమొండయ్య (మాజీ సర్పంచ్), చిక్కుడు రాజయ్య(మాజీ వార్డుసభ్యులు), పిట్టల అంజయ్య (ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు), శిలువేరి రాజేందర్ (బీఆర్‌ఎస్ గ్రామశాఖ యువత అధ్యక్షుడు), బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు అక్కల సుధాకర్, రెడ్డి జంపయ్య, రెడ్డి శంకర్, పల్లె కుమార్, పిట్టల రాములు, పిట్టల సదానందం ఓదెల మాజీ వైస్‌ఎంపీపీ అంబాల కొమురయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండారి రాము, ఖలీం, సాయి పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ ఉచిత కోచింగ్

గోదావరిఖని: నిరుద్యోగ యువత కోసం నిర్వహించే ఉచిత స్కిల్ డెవలప్‌మెంట్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సింగరేణి పరిసర ప్రాంత యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 38 వృత్తి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో కాస్మోటాలజీ (మహిళలు), డ్రోన్ టెక్నీషియన్, సోలార్ టెక్నీషియన్, సెల్ టెక్నీషియన్, టూవీలర్ మెకానిక్, ఆర్క్ అండ్ గ్యాస్ వెల్డింగ్, కంప్యూటర్ డీటీపీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ కోర్సులతో పాటు మొత్తం 38 కోర్సుల్లో ఉచిత శిక్ష ఇవ్వనున్నట్లు వివరించారు. కాస్మోటాలజీ కోర్సుకు ఎలాంటి విద్యార్హత అవసరం లేదని, ఇతర కోర్సులకు డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, పదో తరగతి పాసై ఉండాలన్నారు. రామగుండం రీజియన్‌లోని, ఆర్జీ–1, 2, 3 ఏరియాలకు చెందిన 18 నుంచి 42 ఏళ్ల వయసు మధ్య ఉన్న యువత తమ దరఖాస్తులను సమీప ఎంవీటీసీలో 30లోగా నేరుగా సమర్పించాలని సూచించారు.

ముందస్తు బడిబాట కార్యక్రమం



బడిబాటలో సీఆర్‌పీ రామ్‌కుమార్

జ్యోతినగర్: ముందస్తు బడి బాట కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్‌పీ రామ్‌కుమార్ పాల్గొన్నారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం ఏరియాలోని పరిసర ప్రాంతాల్లో ముందస్తు బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఖాజీపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు సత్యనారాయణ, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్(సీఆర్‌పీ) రామ్ కుమార్ పాల్గొన్నారు. పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించే తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థుల వివరాలు తీసుకున్నారు.

శ్రీరామ విద్యానికేతన్‌లో గ్రాడ్యుయేషన్ డే

గోదావరిఖనిటౌన్: స్థానిక అడ్డగుంటపల్లిలోని శ్రీరామ విద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. వివిధ అంశాలలో ప్రతిభ చాటిన చిన్నారులు సర్టిఫికెట్స్ అందించారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల కరస్పాండెంట్ ఎస్.వెంకటేశ్వరరావు, హెచ్.ఎం.సూర్యదేవర జ్యోతి, ఉపాధ్యాయులు ప్రశాంతి, తాలియా, గౌతమి, విజయ, పద్మావతి, రాణి, లైలమ్మ, భాగ్యలక్ష్మి, శైలజ, లక్ష్మి పాల్గొన్నారు.

నేడు ఎడ్లబండి పోటీలు

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయం వద్ద శనివారం ఎండ్లబండి పోటీలు నిర్వహించనున్నట్లు పోటీల ఆర్గనైజర్ సంకెన్ల లక్ష్మన్ చెప్పారు. ఎండలను దృష్టిలో పెట్టుకుని ఉదయం 10 గంటలలోపే రైతులు తమ ఎడ్ల బండితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. మొదటి, రెండో, మూడో స్థానంలో నిలిచిన విజేతలకు బహుమతి ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోదావరిఖనిటౌన్: విద్యుత్ ఉపకేంద్రాల మరమ్మతు కారణంగా శనివారం పట్టణంలోని పలు ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ అడిచెర్ల శ్రీనివాస్ తెలిపారు. స్థానిక గౌతమినగర్, జనగాం, రాంమందిర్ ఏరియా, పీజీ సెంటర్ విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఓటును సద్వినియోగం చేసుకోవాలి

• బల్దియా కమిషనర్ శ్రీకాంత్



ప్రతిజ్ఞ చేస్తున్న మెడికోలు

కోల్‌సిటీ: ఓటుహక్కు మన భవిష్యత్‌ను నిర్దేశిస్తుంది. అటువంటి ఓటును సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ అన్నారు. రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖనిలోని ప్రభుత్వ సిమ్స్ మెడికల్ కాలేజీలో స్వీప్‌పై జిల్లా సంక్షేమశాఖ అధికారి రౌఫ్ ఖాన్‌తో కలిసి కమిషనర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు. మతం, వర్గం, కులం, జాతి, భాష ప్రలోభాలకు, ఒత్తిడికి లోనుకాకుండా నిజాయితీగా ఓటు వేయాలని సూచించారు. ప్రతి ఎన్నికల్లో తాము నిర్భయంగా ఓటు వేయడంతోపాటు తమ తల్లిదండ్రులను, ప్రొఫెసర్లను, బంధుమిత్రులను ఓటుహక్కు వినియోగించుకునేలా అభ్యర్థిస్తామని మెడికోలతో ప్రతిజ్ఞ చేయించారు. మెడికల్ కాలేజీ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మెడికోలు పాల్గొన్నారు.

ఓటుహక్కు అందరి బాధ్యత

ఫెర్టిలైజర్‌సిటీ: లోక్‌సభ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం రామగుండం ఎరువుల కర్మాగారంలో ఏర్పాటు చేసిన ఓటరు అవగాహన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడారు. ఓటు ప్రాముఖ్యతపై వివరించారు. జిల్లా నోడల్ అధికారి రవూఫ్‌ఖాన్, ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ మధుసూదనాచారి పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ..

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని చిన్నరాతుపల్లి గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ జాహెద్ పాషా ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. నిజాయతీగా ఓటు వేస్తామని, ఓటు హక్కు సద్వినియోగం చేసుకుంటామని ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీటీ ధీరజ్, ఆర్‌ఐ ఉదయశ్రీ, నర్సింగం, ల్యాండ్‌సర్వేయర్ గణేశ్ నాయక్, బీఎల్‌వోలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



ఆందోళనలో రైతు కూలీ సంఘం నాయకులు

రామగుండం: ఉపాధి హామీ పథకం కూలీలకు పని స్థలాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం ఎంపీడీవో ఎం.ఏ.అలీంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు మేర్గు చంద్రయ్య మాట్లాడుతూ ప్రస్తుతం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ఉదయం 6గంటల నుంచి 10 వరకు పని చేయించాల్సి ఉండగా మధ్యాహ్నం వరకు పని చేయిస్తున్నారని ఆరోపించారు. కాగా వేసవి అలవెన్సులు, పార, గడ్డపార, పని స్థలానికి ఐదు కిలోమీటర్ల దూరం, తాగునీరు తదితర సౌకర్యాల నిమిత్తం గతంలో రూ.50 కేటాయిస్తుండగా ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం వాటిని తొలగించిందన్నారు. ప్రస్తుతం ప్రతి ఉపాధి కూలీకి 200 పనిదినాలు కల్పించాలని, రూ.600 కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు కొల్లూరి మల్లేశ్, పైడిపల్లి రమేశ్, కోడిపుంజుల భూమేశ్, తమ్మనవేణి రాజకొమురయ్య, బోయపోతు సాగర్, దొబ్బల తిరుపతి, శంకర్ తదితరులు ఉన్నారు.

మిషన్ లైఫ్ స్టైల్‌పై సమీక్ష సమావేశం



సమావేశం నిర్వహిస్తున్న జీఎం

రామగిరి: జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలపై శుక్రవారం ఆర్జీ–3, ఏపీఏ జీఎం ఎన్.సుధాకర్ రావు జీఎం కార్యాలయంలో వివిధ గనుల, విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పర్యావరణం కోసం మిషన్ లైఫ్ స్టైల్‌పై నెలరోజుల పాటు అవగాహన, ప్రచార కార్యక్రమాలు, ఉద్యోగులకు అవగాహన కల్పించడంపై అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి, ఫైనాన్స్ ఏ.జీ.ఎం పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి



మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న అధికారి శ్రీమాల

సుల్తానాబాద్‌రూరల్: కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా సహకార అధికారి శ్రీమాల అన్నారు. సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల కోసం తాగునీరు, నీడ ఇచ్చేందుకు చలువ పందిల్లు వేయాలని సూచించారు. అలాగే ధాన్యానికి సంబంధించిన ట్రాక్‌షీట్‌ను వెంటనే రైతులకు అందజేయాలన్నారు. సంఘం సీఈవో రమేశ్, రైతులు, సిబ్బంది ఉన్నారు.

కందుగుల కుమార్‌కు సేవారత్న అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న కుమార్

రామగుండం: బూస లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్టు ప్రథమ వార్షికోత్సవం పురస్కరించుకొని వివిధ రంగాల్లో సామాజిక సేవలు అందిస్తున్న సేవకులకు శుక్రవారం సేవారత్న అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో భాగంగానే అంతర్గాం మండల పరిధిలోని మద్రిపల్లికి చెందిన కందుగుల కుమార్ కొన్నేళ్లుగా కుల సంఘానికి సేవలు అందిస్తూ ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ కాళేశ్వరం జోనల్ యూత్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా అసోసియేషన్ తరఫున అందిస్తున్న సేవలకు గుర్తింపుగా సేవారత్న అవార్డు ప్రదానం చేశారు. ట్రస్టు చైర్మన్ బూస ప్రదీప్, దళితరత్న డాక్టర్ దేవి లక్ష్మీనర్సయ్య ఉన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ

సుల్తానాబాద్: పట్టణంలోని పూసాలలో ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠించారు. శుక్రవారం పట్టణంలోని పాత గ్రామపంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన బొడ్రాయితోపాటు మహాలక్ష్మి, భూలక్ష్మి విగ్రహాలను ప్రతిష్ఠించే ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీవాసులందరూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమెను సన్మానించారు. హాజరైన భక్తులందరికీ పూజారి రమేశ్‌శర్మ ఆశీర్వచనం అందజేశారు. ప్లాట్‌ఫాం నిర్మాణం గ్రానైట్ దాత వలస స్వరూప-నీలయ్య, వివిధ కులసంఘాల నాయకులు, పార్టీల నాయకులు కోట రంగారెడ్డి, తిరుపతిరెడ్డి, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, వేగోళం అబ్బయ్యగౌడ్, పురం ప్రేమ్‌చందర్ రావు, శంకర్, రవీందర్, గుర్రాల శ్రీనివాస్, కంకణాల తిరుపతి, సతీశ్, పురం రమణ, సతీశ్, కాల్వల శ్రీనివాస్ ఉన్నారు.

ముగిసిన శ్రీసీతారామచంద్ర కల్యాణ బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

రామగిరి: సెంటినరీకాలనీలోని శ్రీకోదండ రామాలయంలో 15 నుంచి జరుగుతున్న శ్రీసీతారామచంద్ర స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. జగన్నాథచార్యులు, ఆలయ పూజారులు వేణు మనోహర చార్యులు, శ్యాంసుందర చార్యులు ఆధ్వర్యంలో జరిగిన కల్యాణ మహోత్సవానికి ఆలయ కమిటీ చైర్మన్ వనం రామచంద్రరావు దంపతులు పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. ఆర్జీ–3 జీఎం ఎన్.సుధాకర్‌రావు, మంథని సీఐ వెంకటేశ్వర్లు దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. విశాఖ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గడ్డం సరోజన–వివేక్ వెంకటస్వామి అన్నదానం చేశారు. ఆలయ వర్కింగ్ చైర్మన్ గంట వెంకటరమణారెడ్డి, వైస్‌చైర్మన్ కాటా సత్యం, తిప్పర్తి రవీందర్‌రెడ్డి, కోరుకొప్పుల తులసీరాంగౌడ్, జాయింట్ సెక్రటరీ వేగోలపు సత్యనారాయణగౌడ్, ఎంఆర్‌సీ రెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన



మహిళా సాధికారతపై సమావేశం

జూలపల్లి: మహిళలు లింగవివక్ష లేకుండా మహిళా సాధికారత దిశగా ముందుకు సాగాలని మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ సుచరిత చెప్పారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా సాధికారతపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బేటీ బచావో, బేటీ పడావో ముఖ్య ఉద్దేశం వివరిస్తూ బాల్య వివాహాలు, గృహహింస, పోక్సో చట్టం, లైంగిక వేధింపులు, సఖి కేంద్రం సేవలు, హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సీఈవో కలీమొద్దీన్, హెచ్‌వీ వసంత తదితరులు పాల్గొన్నారు.

‘ఇటుకబట్టీ యజమానులపై చర్యలు తీసుకోవాలి’

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ఇటుక బట్టీల్లో పనిచేసే వలస కూలీలకు కనీస వసతులు కల్పించడంతో యాజమాన్యాలు విఫలమవుతున్నాయని సీపీఎం ఏరియా కార్యదర్శి సీపెల్లి రవీందర్ ఆరోపించారు. వలస కూలీలకు కనీస వసతులు కల్పించని యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం కార్మికశాఖ కార్యాలయంలో రాముకు వినతిపత్రం అందించారు. బట్టీల్లో పనిచేస్తున్న వలస కూలీలకు విద్య, వైద్యం అందడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి బట్టీలను తనిఖీ చేసి కనీస వసతులు కల్పించని ఇటుక బట్టీ యాజమాన్యాలపై చర్యలు తీసుకుని వలస కూలీలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. నాయకులు సందీప్, సురేశ్, ప్రశాంత్ ఉన్నారు.

‘కొప్పుల’ నామినేషన్‌కు తరలిన ప్రజాప్రతినిధులు

సుల్తానాబాద్: బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ నామినేషన్‌కు సుల్తానాబాద్ నుంచి బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తరలివెళ్లారు. శుక్రవారం పెద్దపల్లి కలెక్టరేట్‌లో నామినేషన్ వేసిన సందర్భంగా వెళ్లినట్లు వారు తెలిపారు. బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఎంపీపీ బాలాజీరావు, రైతుసంఘం మాజీ మండలాధ్యక్షులు బోయిని రాయమల్లు, ఆంజనేయులు పాల్గొన్నారు.


ఎలిగేడు: బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నామినేషన్ వేశారు. ఆయనకు మద్దతుగా నామినేషన్ కార్యక్రమానికి ఎలిగేడు మండలం నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. తరలిన వారిలో ఎంపీపీ దంపతులు తానిపర్తి స్రవంతిమోహన్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, బీఆర్‌ఎస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ధర్మారం: ధర్మారం మండలం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. సహకార సంఘాల ఫోరం జిల్లా చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు పుస్కూరి జితేందర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోమటిరెడ్డి మల్లారెడ్డి, ఎంపీటీసీ దాడి సదయ్య ఉన్నారు.

పెద్దపల్లి పార్లమెంట్ ఎస్సీసెల్ ఇన్‌చార్జిగా శ్రీనివాస్

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మండలం కాట్నపల్లికి చెందిన కల్వల శ్రీనివాస్‌ను పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం ఎస్సీ సెల్ ఇన్‌చార్జిగా నియమిస్తూ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నగరిగారి ప్రీతం ఉత్తర్వులు జారీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం తనవంతు కృషి చేస్తానన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



శుభ్రం చేయిస్తున్న కౌన్సిలర్ భాగ్యలక్ష్మి

పెద్దపల్లిరూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామనే విషయాన్ని అందరూ గ్రహించాలని కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి అన్నారు. పట్టణంలోని రాజీవ్‌నగర్, నారాయణస్వామినగర్ ప్రాంతాల్లో శుక్రవారం స్వచ్ఛశుక్రవార్ కార్యక్రమాన్ని కౌన్సిలర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. వార్డులో పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు మురుగు నీటి కాలువలను శుభ్రం చేయించేందుకు ప్రతి శుక్రవారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎండలు మండిపోతుండడంతో ప్రజలు మధ్యాహ్నం బయటకు రావొద్దని సూచించారు. ఎండలో తిరిగితే వడదెబ్బ బారిన పడే అవకాశముందన్నారు. సిబ్బంది కరుణాకర్, ఎల్లమ్మ, భూమయ్య ఉన్నారు.

గీట్ల ముకుందరెడ్డి సేవలు చిరస్మరణీయం



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్: పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దివంగత నేత గీట్ల ముకుందరెడ్డి సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారం గ్రామంలో శుక్రవారం గీట్ల ఘాట్ వద్ద నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని నివాళి అర్పించారు. నియోజకవర్గ అభివృద్ధిలో గీట్ల తనదైన ముద్ర వేసుకున్నారని మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచు తులా మనోహర్‌రావు, గీట్ల తనయుడు రాజేందర్‌రెడ్డి, ఎంపీటీసీ కొల్లూరి రమాదేవి రాజమల్లు, మాజీ ఎంపీటీసీ సాధనవేన రాజేశ్వరి కొమురయ్య, మాజీ సర్పంచులు నిర్మల, మొగిలి, విజయ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు మునీర్, బాజీపటేల్ ఉన్నారు.

ఎలిగేడు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ

ఎలిగేడు: పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ గీట్ల ముకుందరెడ్డి వర్ధంతి శుక్రవారం మండలకేంద్రంలో గీట్ల అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఎలిగేడు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా, ఎలిగేడు మాజీ ఉపసర్పంచ్ గుడుగుల మహేందర్, మాజీ వార్డుసభ్యులు తాటిపల్లి సతీశ్‌బాబు, మామిడాల రమేశ్, కవ్వంపల్లి నారాయణ, అభిమానులు బత్తిని మహేశ్, సాయి పాల్గొన్నారు.

స్వయంగా కారు నడుపుతూ.. నామినేషన్‌కు



కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ తానే స్వయంగా కారు నడుపుతూ ఎమ్మెల్యేలతో కలిసి నామినేషన్ దాఖలు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు. శుక్రవారం మంచిరోజు కావడంతో ముందుగా తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుని వచ్చానంటూ కార్యకర్తలకు అభివాదం చేస్తూ కలెక్టరేట్‌లోకి వెళ్లారు వంశీకృష్ణ.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహుని కల్యాణం





కల్యాణం నిర్వహిస్తున్న పండితులు, హాజరైన భక్తులు

జూలపల్లి: పెద్దాపూర్ శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయంలో ఉదయం ధ్వజారోహణ అనంతరం ప్రత్యేకంగా వేసిన పెళ్లి మండపంలో కల్యాణం నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సదయ్య, ఎంపీటీసీలు జి.రజనీ, రవీందర్‌రెడ్డి, అబ్బాపూర్ ఎంపీటీసీ దండె వెంకటేశం, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు రూ.50వేల చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

గోదావరిఖనిటౌన్: కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బూస లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు బూస శ్రావణి–ప్రదీప్ దంపతులు స్థానిక కళాకారులకు శుక్రవారం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో రూ.50వేల చెక్కును అందజేశారు. అలాగే నవోదయ పాఠశాలలో చదువుతున్న రసజ్ఞ విద్యార్థిని ఏడాది పాటు దత్తత తీసుకొని ప్రస్తుతం చదువుకు అయ్యే ఖర్చు నిమిత్తం రూ.5వేలు అందించారు. మంథనిలోని విలాసాగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రూ.5వేలు అందజేశారు. పారంట్ల ప్రవీణ్‌కుమార్, దేవీ లక్ష్మీనర్సయ్య, గుమ్మడి రాజ్‌కుమార్, కోటేష్‌గౌడ్, మహేందర్, భీష్మాచారి పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. కుందనపల్లి గ్రామస్తుడైన ఎన్టీపీసీలో క్లాస్–1 కాంట్రాక్టర్ కాంతాల శ్రీనివాస్‌రెడ్డి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఆయన సొంత ఖర్చులతో నిర్వహించారు. ప్రతిష్ఠాపన అనంతరం ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. పూజారి రాంపెల్లి మురళీధర్‌శర్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

శంకర్‌నాయక్‌కు సన్మానం



సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 15వ డివిజన్ కార్పొరేటర్, గిరిజన (లంబాడి) పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాదవత్ శంకర్ నాయక్ సింగరేణి ఉద్యోగం విరమణ సందర్భంగా యైటింక్లయిన్‌కాలనీ కార్యాలయంలో ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ దరవాత్ పంతులు నాయక్, లంబాడి ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్, సెంట్రల్ కమిటీ సభ్యుడు కిషన్‌నాయక్, ఆర్జీ–2 లైజనింగ్ ఆఫీసర్ బూక్య దేశాయి, తిరుపతి, హరిహర, కుమార్‌నాయక్, ఉమేశ్, బిక్షనాయక్, రాజేశ్‌నాయక్ పాల్గొన్నారు.

బియ్యం అందజేత

పెద్దపల్లిరూరల్: పట్టణానికి చెందిన బాబుమియా కూతురు సమీరా పెళ్లి కోసం విజ్ఞన్న యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లం వినోద్‌రెడ్డి శుక్రవారం క్వింటాల్ బియ్యం అందజేశారు. సభ్యులు అహ్మద్, రాజా, సంధాని, చందు, మెహరాజ్, ఫహీం, అఫ్రోజ్, సలీం పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు అబ్బాపూర్‌లో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో చలివేంద్రాలను పంచాయతీ కార్యదర్శులు ప్రారంభించారు.

పాముకాటుతో ఎద్దు మృతి

రామగిరి: మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన మాటేటి పర్వతాలుకు చెందిన ఎద్దు శుక్రవారం పాముకాటుతో మృతి చెందింది. రైతు వివరాల ప్రకారం ప్రతీరోజూ లాగా శుక్రవారం ఉదయం తన ఎద్దును మేతకు తీసుకెళ్లగా పాము కాటుకు గురైంది. గమనించి మండల పశువైద్యాధికారి దుర్గాప్రసాద్‌కు సమాచారం అందించారు. పాముకాటుకు గురైన ఎద్దుకు చికిత్స అందించాడు. కానీ పరిస్థితి విషమించడంతో ఎద్దు మృతి చెందిందని ఆయన తెలిపారు.